# రైతుల సంక్షేమానికి సర్కారు కృషి



నాగిరెడ్డిపూర్ రైతులకు పరిహారం చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- నిర్వాసితులకు రూ. 2 కోట్ల పరిహారం చెక్కుల పంపిణీ

గంగాధర, సెప్టెంబర్ 30: రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మోతె ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఓటీలు, కాలువల కింద మండలంలోని నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన 12 మంది రైతులు 8 ఎకరాల భూమిని కోల్పోగా రూ. 2 కోట్ల పరిహారం మంజూరైంది. కాగా, మండలంలోని బూరుగుపల్లిలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం రైతులకు పరిహారం చెక్కులు ఆందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మోతె రిజర్వాయర్ నిర్మిస్తే రామడుగు మండలంలో 11 గ్రామాల ముంపునకు గురయ్యేవని, సీఎం కేసీఆర్ వినూత్నంగా ఆలోచన చేసి ఒక్క గ్రామం ముంపునకు గురికాకుండా రూ. 248 కోట్లతో వరద కాలువలకు ఓటీలను ఏర్పాటు చేయడంతో పాటు కాలువల నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. ఓటీల నిర్మాణం పూర్తయితే రామడుగు, గంగాధర, చొప్పదండి మండలాల్లోని 30 వేల ఎకరాల్లో ఆయకట్టుకు నీరందుతుందన్నారు. కాగా పరిహారం చెక్కులు అందజేసిన ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపూర్ వీడీసీ చైర్మన్ పంజాల ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పురుషోత్తం దేవయ్య, రైతులు పాల్గొన్నారు.

### నిధుల మంజూరు పత్రాల అందజేత

రాష్ట్రంలో కుల సంఘాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని ర్యాలపల్లిలో మాదిగ, మాల, మహిళా సంఘ భవనాల నిర్మాణానికి రూ.4.60 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. కాగా, శనివారం ర్యాలపల్లిలో ఆయా సంఘాల సభ్యులకు నిధుల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే రవిశంకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కాగా, కుల సంఘ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే రవిశంకర్‌కు మాదిగ, మాల, మహిళా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పానుగంటి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకులు అట్ల రాజిరెడ్డి, దానె ఓదెలు, కుల సంఘాల, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని 8 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.1.49 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, మండలంలోని బూరుగుపల్లిలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు, ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే రవిశంకర్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లోకిని ఎల్లయ్య, సర్పంచులు వేముల దామోదర్, మాల చంద్రయ్య, నాయకులు రేండ్ల శ్రీనివాస్, రామిడి సురేందర్, ఇరుగురాల రవి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న ఇంద్రనీల్

## యువకుల రక్తదానం

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 30: హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ పుట్టిన రోజు వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎంజీఆర్ బ్లడ్ బ్యాంక్‌లో 30 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ యువ నాయకుడు వొడితల ఇంద్రనీల్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి, రక్తదానం చేసిన యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత తగరపు నవీన్, బీఆర్ఎస్వీ నాయకులు బొడ ఆంజనేయులు, లింగంపల్లి అరవింద్, శశాంక్, దుగ్యాల రాజ్‌పాల్, కే లక్ష్మణ్, మామిడిపల్లి సాయికుమార్, సిద్ధు, రాజీవ్, జాషువ, నీరజ్, చక్రి, నవీన్, పెరం రంజిత్, సందీప్, ఆదర్శ్, సాయి కృష్ణ, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కలిసిన ముదిరాజ్ మహాసభ నాయకులు



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 30: నగరంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌ను జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు గుర్రాల మల్లేశం ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలోని ముదిరాజ్ కులస్తులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. ఉజ్వల పార్కు సమీపంలో గల ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు కేటాయించాలని వినతి ప్రతం అందజేశారు. రెండు మూడు రోజుల్లో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ముదిరాజ్ కులస్తులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి జడ్పీటీసీ పిట్టల కరుణా రవీందర్, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డివేణి మధు, చిగురుమామిడి జడ్పీటీసీ గీకురు రవీందర్, ముదిరాజ్ మహాసభ నాయకులు బాలు, నర్సయ్య, బండారి భూమేశ్, నరేందర్, శ్రీధర్, భాను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ గోపి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 30: భారత ఎన్నికల సంఘం ఎన్నికల అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా పాలన యంత్రాంగం, యువ ఓటర్లు, భవిష్యత్ ఓటర్ల కోసం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విభాగంలో నిర్వహించిన పాటలు, కవితల రచన పోటీల్లో భాగంగా కరీంనగర్ లక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని నబీలా మహ్మద్ ద్వితీయ బహుమతి సాధించింది. నబీలా మహ్మద్ ఓటు హక్కు, ప్రజాస్వామ్యంలో ఓటర్ల పాత్ర గురించి చైతన్యం కలిగేలా రాసి వినిపించిన పద్యం అందరినీ ఆకట్టుకుంది. నబీలా మహ్మద్ ప్రతిభను పలువురు అధికారులు మెచ్చుకొని ప్రశంసా పత్రం, రూ.4వేల నగదు అందజేశారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో జనార్దన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్, ప్రముఖ యూ ట్యూబర్ ఆర్ఎస్ నందా, గైనకాలజిస్టు శ్రీలత పాల్గొన్నారు. నబీలా మహ్మద్‌ను లక్ష్ విద్యా సంస్థల చైర్మన్ ముస్తాక్ అలీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## జాగ్రత్తలు తీసుకోవాలి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 30: జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, బదిలీల్లో భాగంగా స్పౌజ్ పాయింట్లు పొందిన వారంతా జాగ్రత్తలు తీసుకోవాలని డీఈవో జనార్దన్ రావు సూచించారు. ఇందులో బదిలీ కోరుతూ ఆప్షన్స్ పొందుపరిచే క్రమంలో తమతమ స్పౌజ్ సమీప పాఠశాలలను ఎంచుకోవాలని పేర్కొన్నారు. స్పౌజ్ దరఖాస్తుదారులు పొందుపర్చిన ఆప్షన్ల ప్రింట్ కాపీలను అక్టోబర్ ఒకటిన ఉదయం 10 గంటలకు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఆ పత్రాలను ఎంఈవోలతో విచారణ జరిపిస్తామని చెప్పారు. ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నేడు విద్యార్థుల శ్రమదానం

చొప్పదండి, సెప్టెంబర్ 30: అక్టోబర్ ఒకటిన కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జవహర్ నవోదయ విద్యాలయం (చొప్పదండి) విద్యార్థులు పట్టణంలోని ఒకటో వార్డు (తొగురుమామిడికుంట)లో ఆదివారం శ్రమదానం చేస్తారని ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఏక్ సాత్ ఏక్ గంట కార్యక్రమాన్ని ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యావన శాఖ అధికారి రోహిత్

రామడుగు, సెప్టెంబర్ 30: రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టిసారించాలని ఉద్యావన శాఖ అధికారి రోహిత్ పేర్కొన్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట రైతు వేదికలో శనివారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఆయిల్ పామ్ మొక్క నాటిన 4 నుంచి 30 సంవత్సరాల వరకు నిరంతరంగా ఆదాయం వస్తూనే ఉంటుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. అంతర పంటలను కూడా సాగుచేసుకోవచ్చనీ, తద్వారా ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. ఆయిల్‌పామ్ సాగులో చీడ పీడల బెడద తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్ గ్రామ కో–ఆర్డినేటర్ సుద్దాల మల్లేశం గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి సంపత్, ఎఫ్‌వో శ్రావణ్, రైతులు ముదుగంటి రాజిరెడ్డి, బండి రాజమల్లు, బసంతం, తదితరులు పాల్గొన్నారు.

## జూట్ బ్యాగుల పంపిణీ



మత్స్యకారులకు జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నవీన్‌రావు

గంగాధర, సెప్టెంబర్ 30: గ్రామాల్లో ప్లాస్టిక్‌ను నిషేధించి చెరువులను కాపాడుకోవాలని సర్పంచ్ మేచినేని నవీన్‌రావు పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపు మేరకు మండలంలోని కురిక్యాలలో శనివారం చెరువులోకి వెళ్లి మత్స్యకారులకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రావు మాట్లాడుతూ, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ సూచనతో గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పౌరహక్కుల దినోత్సవం

రామడుగు, సెప్టెంబర్ 30: మండలంలోని మోతె అంబేద్కర్ సంఘం భవనంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీడీవో భాస్కర్‌రావు గ్రామంలోని సమస్యలను ఎస్సీ కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, ఎంఈవో వేణుకుమార్, తహసీల్దార్ సీనియర్ అసిస్టెంట్ శంకర్, గిర్దావర్ రజనీ, పోలీసులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

చొప్పదండి, సెప్టెంబర్ 30: కోనేరుపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ చిలుక రవీందర్ మాట్లాడుతూ, కుల వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. సర్పంచ్ తులసమ్మ, ఆర్ఐ త్రిపాల్ సింగ్, ఏఎస్ఐ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నియామకం

గంగాధర, సెప్టెంబర్ 30: అఖిల భారత యాదవ మహాసభ మండల ఉపాధ్యక్షుడిగా ఒద్యారం గ్రామానికి చెందిన మేకబోయిన రాజును నియమిస్తూ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం మధురానగర్‌లో రాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మాదం ఐలయ్య, సంఘం నాయకులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ నాయకులు సామల ఎల్లయ్య, బత్తుల వేణుగోపాల్, మేకబోయిన సంపత్ , తెల్ల ఎల్లయ్య, చూడబోయిన మధు, మేకల శేఖర్, గడ్డి బాలు, అమ్ముల బాలు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రజక సంఘం కార్యవర్గం

గంగాధర, సెప్టెంబర్ 30: మండలంలోని మధురానగర్ రజక సంఘం కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరుకుల్ల గంగయ్య, ఉపాధ్యక్షులుగా నేరెళ్ల రాజు, మల్యాల కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల శివశంకర్, సంయుక్త కార్యదర్శిగా పంతంగి నారాయణ, కోశాధికారిగా మల్యాల నర్సయ్య, నరుకుల్ల మల్లేశం, యూత్ అధ్యక్షుడిగా మొగిల్ల రమేశ్, యూత్ ఉపాధ్యక్షులుగా నేరెళ్ల ప్రసాద్, పొన్నాల సంతోష్, ఎడవెల్లి నవీన్, సోషల్ మీడియా కన్వీనర్లుగా గుండారం శశికుమార్, ఆకునూరి కనకరాజ్, ప్రధాన సలహాదారుగా అంతగిరి బాలరాజు, సలహాదారులుగా ఆకునూరి నాగమల్లు, నరుకుల్ల అంజయ్య, మల్యాల కొమురయ్య, మల్యాల గోపి, పొన్నాల అంజయ్య, పొన్నాల మొండయ్య, ఎడవెల్లి లింగయ్య, మల్యాల శేఖర్, నడిగొట్టు లచ్చయ్య ఎన్నికయ్యారు. కాగా, నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న రజక సంఘం సభ్యులు

## వైద్యశిబిరం

గంగాధర, సెప్టెంబర్ 30: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజు పేర్కొన్నారు. వెంకటాయపల్లిలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది గ్రామస్తులు పరీక్షలు చేసి అవసరమున్న వారికి మందులు అందజేశారు. ఉపసర్పంచ్ వేముల శ్రీధర్, వైద్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.